క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

గోల్కొండ: ప్రయాణికులకు మరిన్ని మెరుగైన సదుపాయాలు కల్పించడానికి రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ ఎప్పుడూ కృషి చేస్తూ ఉంటుందని ఆర్టీసీ మెహిదీపట్నం డిపో మేనేజర్ సూర్యనారాయణ అన్నారు. ఇందులో భాగంగా ప్రయాణికులకు నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. ప్రయాణికులు, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు, విద్యాసంస్థల వారు తమ తమ ప్రాంతాల్లో బస్సు సౌకర్యం, అదనపు బస్సు ట్రిప్పుల కోసం ఈ కార్యక్రమం ద్వారా నేరుగా ఆయన దృష్టికి రావచ్చన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తమతో నేరుగా తమ సలహాలు, సూచనలు ఇవ్వడానికి 99592 26133లో మాట్లాడవచ్చని ఆయన తెలిపారు.

ఏప్రిల్ 26 నుంచి ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు

నాంపల్లి: విద్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి పద్మశ్రీ నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాలను ఏప్రిల్ 26, 27, 28 తేదీల్లో యూనివర్సిటీలోని కళామందిరంలో నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయంలో ఇప్పుడు చదువుతున్న విద్యార్థులతో పాటు 37 ఏళ్లుగా ఆయా శాఖల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహిస్తారన్నారు.

జాతీయ మైనార్టీ కమిషన్ కాన్ఫరెన్స్‌కు ఆహ్వానం

చార్మినార్: ఈనెల 29న, న్యూ ఢిల్లీలో జరుగనున్న జాతీయ మైనార్టీ కమిషన్ కాన్ఫరెన్స్‌కు పాతబస్తీ దారుషిఫాకు చెందిన బీజేపీ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీకి ఆహ్వానం అందింది. జాతీయ స్థాయిలో మైనార్టీల విద్యా, ఉద్యోగ, హౌసింగ్, సెక్యూరిటీ, ఉపాధి అవకాశాలపై జాతీయ స్థాయిలో ఈ వేదిక ద్వారా చర్చించనున్నారు. ఈ మేరకు ఈ కాన్ఫరెన్స్‌కు అధికారికంగా హాజరుకావాలని తనకు జాతీయ మైనార్టీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్ సింగ్ లాల్‌పురా నుంచి అధికారికంగా ఆహ్వానం అందిందని ఆయన సోమవారం విలేకర్లకు వివరించారు.

షేక్‌పేట్‌లో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో షేక్‌పేట్ కార్పొరేటర్ రాషెద్

గోల్కొండ: రంజాన్ మాసంలో నిర్వహించే సామూహిక ఇఫ్తార్ విందులు స్థానికుల మధ్య స్నేహ సంబంధాలను పటిష్టం చేస్తాయని బల్దియా స్టాండింగ్ కమిటీ సభ్యుడు, షేక్‌పేట్ కార్పొరేటర్ మహ్మద్ రాషెద్ ఫరాజుద్దీన్ అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని డైమండ్‌హిల్స్ కాలనీలో స్థానిక కాలనీ సంక్షేమ సంఘం వారు నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ ఏరియా కమిటీ నాయకులు నదీమ్‌తో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే అండతో వేధిస్తున్నారు'

లంగర్‌హౌస్: 50 ఏళ్లుగా ఉపయోగిస్తున్న రోడ్డును ఎమ్మెల్యే ప్రోద్బలంతో ఆక్రమణలకు పాల్పడుతున్నారని బీజేపీ హైదరాబాద్ పార్లమెంట్ కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి, నగర కార్యదర్శి వినేష్‌సింగ్ అన్నారు. లంగర్‌హౌస్ చెరువు సమీపంలో శ్రీహనుమాన్ ఆలయ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే అండతో ఆటంకాలు కల్గిస్తున్నారని బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు కలిసి సోమవారం గోల్కొండ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ.. హనుమాన్ ఆలయ నిర్మాణం కోసం వచ్చే వాహనాలు రాకుండా రోడ్లపై అడ్డంగా వాహనాలు నిలిపి కొందరు అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయం పరిసర ప్రాంతాల్లో శిఖం భూమిలో వెలసిన అక్రమ కట్టడాలను వెంటనే తొలగించాలని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామన్నారు. బీఆర్ఎస్ నాయకులు జగదీష్ యాదవ్, శ్రవణ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

లంగర్‌హౌస్: రోడ్డు పక్కన నడిచి వెళ్తున్న మహిళను ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో ఆమె చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ ఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. దాదాపు 40 ఏళ్ల వయస్సు ఉన్న ఓ మహిళ ఈనెల 24న రాత్రి 11 గంటల ప్రాంతంలో లంగర్‌హౌస్ బాపూఘాట్ వద్ద ఓ ఆస్పత్రి ముందు నడిచి వెళ్తుంది. ఆ సమయంలో టిప్పుఖాన్ బ్రిడ్జి నుంచి మెహిదీపట్నం వైపు వేగంగా వెళ్తున్న ద్విచక్ర వాహనం ఆమెను బలంగా ఢీకొట్టింది. తీవ్రగాయాలకు గురైన ఆమెను చికిత్స నిమిత్తం స్థానికులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఆమె చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. అయితే మృతురాలి వివరాలు తెలియరాలేవని, మృతురాలి సంబంధీకులు లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్‌లో కానీ, 8712661272లో కానీ సంప్రదించాలని పోలీసులు కోరారు.

పాయా.. మజా ఆయా!

- రంజాన్ మాసంలో నోరూరిస్తున్న మాంసాహార వంటలు
- నాన్ రోటీ పాయా షేర్వాకు భలే గిరాకీ
- భోజన ప్రియులతో కిక్కిరిసిపోతున్న పాతబస్తీ హోటళ్లు



చార్మినార్: రంజాన్ మాసంలో మాంసార వంటలు నోరూరిస్తున్నాయి. ముస్లిం సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా మాంసాహార వంటలు అందుబాటులో ఉన్నాయి. పాతబస్తీలో సాధారణ రోజుల్లో లభించే నాన్ రోటీ, పాయాషేర్వాకు రంజాన్ మాసంలో భలే గిరాకీ ఉంటుంది. ఈ మాసంలో వీటిని విక్రయించే హోటళ్లు అధికం. పేద, ధనిక అనే తారతమ్యం లేకుండా నాన్ రోటీ, పాయా షేర్వా లాగిస్తుంటారు. ఉపవాస దీక్ష విరమించిన వెంటనే ఈ హోటళ్ల వద్ద జనాలు బారులుదీరుతారు.

నాన్ రోటీ..

పాతబస్తీలో సాధారణ రోజుల్లోనూ బ్రేక్‌ఫాస్ట్‌లో నాన్ రోటీని పాయా షేర్వాతో కలిపి తినే కుటుంబాలు చాలానే ఉంటాయి. ప్రస్తుతం రంజాన్ మాసం కొనసాగుతుండడంతో దీనికి మరింత ఆదరణ పెరిగింది. పాతబస్తీ సంస్కృతికి ఆచార వ్యవహారాలకు నాన్ రోటీ గుర్తుగా నిలుస్తోంది. ఒకప్పుడు కేవలం ముస్లింలు మాత్రమే తినే ఈ నాన్ రోటీని ప్రస్తుతం అన్ని వర్గాల ప్రజలు లొట్టలేసుకొని తింటున్నారు. ఎలాంటి మసాలా దినుసులు, నూనె పదార్థాలు వాడకుండా కేవలం మైదా పిండితో తయారయ్యే ఈ నాన్ రోటి పేదోడి దగ్గర నుంచి సంపన్న వర్గాల వరకు అందుబాటులో ఉంటుంది.

400 ఏళ్ల క్రితమే..

పర్షియా భాషలో రోటిని 'నాన్'అంటారు. 400 ఏళ్ల క్రితమే ఈ నాన్ రోటీ మనకు అలవాటయ్యింది. ఇరాన్, టర్కీ (టర్కిస్థాన్) దేశాలకు చెందిన 'డిష్'ఇది. మిడిల్ ఈస్ట్ (అరబ్బు దేశాలు) నుంచి ఈ ఫుడ్ కల్చర్ మన దేశానికి వ్యాపించింది. పాతబస్తీలోని డబీర్‌పురా, చంచల్‌గూడ, యాకుత్‌పురా, ఆజంపురా, బడేబజార్, పురానీహవేళీ, దారుషిఫా, చార్మినార్, మదీనా, ఖిల్వత్, బార్కాస్, బహదూర్‌పురాలతో పాటు సికింద్రాబాద్, మల్లేపల్లి, నాంపల్లి తదితర ప్రాంతాల్లో 200కు పైగా నాన్ రోటీ తయారీ కేంద్రాలున్నాయని వ్యాపారస్తులు చెబుతున్నారు. వీటి ద్వారా కొన్ని వందల కుటుంబాలు రోజువారి ఉపాధి పొందుతున్నారు. లక్షకు పైగా నాన్ రోటీలు రోజు వారి విక్రయాలు జరుగుతాయంటున్నారు. నారీకుల్చా, పెరుగు, చికెన్ 65, మటన్ మసాలాలతో ఈ నాన్ రోటీని తింటారు. ప్రస్తుతం రంజాన్ మాసం సందర్భంగా ఇఫ్తార్ విందులో నాన్ రోటీ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. పేద, గొప్ప అనే తారతమ్యం లేకుండా నాన్ రోటీ తప్పని సరిగా తీసుకుంటున్నారు.

ఎముకలకు బలాన్నిచ్చే పాయా షేర్వా..

ఎముకలకు బలాన్నిచ్చే పోషక విలువలు అధికంగా ఉన్న పాయా షేర్వాను సాధారణ రోజుల్లో కన్నా రంజాన్ మాసంలో పాతబస్తీ ప్రజలు ఇష్టంగా తింటారు. ఇక్కడి ప్రముఖ హోటళ్లలో తెల్లవారు జామున 4 గంటల నుంచే అందుబాటులో ఉంటుంది. తిరిగి సాయంత్రం ఇఫ్తార్‌కు ముందే ఆయా ప్రాంతాల్లోని హోటళ్లలో పాయాషేర్వాను విక్రయిస్తున్నారు. నాన్ రోటీతో పాటు పాయా (మేక కాలు)షేర్వా (మసాలా పులుసు), జెబ్డా (దవడ), జబాన్(నాలుక) భలే రుచిగా ఉంటాయని భోజన ప్రియులు అంటున్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు



డీసీపీ సాయి చైతన్యను సన్మానిస్తున్న పీస్ కమిటీ ప్రతినిధులు

దూద్‌బౌలి: రంజాన్ మాసంలో గట్టి బందోబస్తు కొనసాగిస్తూ ఎవరికి ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటున్నామని దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు నిరంతరం విధినిర్వహణ కొనసాగిస్తున్నారన్నారు. దక్షిణ మండలం పీస్ కమిటీ, దక్షిణ మండలం పోలీసుల సంయుక్తాధ్వర్యంలో సోమవారం రాత్రి ఘాన్సీబజార్‌లోని గాయత్రి భవన్‌లో రంజాన్ మాసం–శాంతి సమావేశం జరిగింది. కమిటీ అధ్యక్షుడు ఖాజా రజియొద్దీన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలువురు అధికార, అనధికార ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీపీ సాయి చైతన్య మాట్లాడుతూ.. పవిత్రమైన రంజాన్ మాసంలో ముస్లింలు రోజుకు ఐదు సార్లు నమాజ్ చేసి రోజంతా కఠోర ఉపవాస దీక్షలు నిర్వహిస్తారన్నారు. సామూహిక ప్రార్థనలతో పాటు తరావీ ప్రార్థనల సందర్భంగా ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ట్రాఫిక్ నియంత్రణతో పాటు ఉచిత పార్కింగ్ సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చామన్నారు. సమావేశం అనంతరం జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మండలం అదనపు డీసీపీ ఆనంద్, మీర్‌చౌక్, చార్మినార్, ఫలక్‌నుమా ఏసీపీలు దామోదర్‌రెడ్డి, రుద్రభాస్కర్, షేక్ జహంగీర్‌తో పాటు శాంతి సంఘం సభ్యులు ముజఫర్, డీఎల్ నర్సింగ్‌రావు, సంపత్ జైస్వాల్, శ్రీకిషన్ శర్మ, శశికాంత్ అగర్వాల్, మామిడి కృష్ణ, కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌ఎఫ్‌ఏయూలో రోడ్డు భద్రత సదస్సు



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు

గోల్కొండ: ట్రాఫిక్ ఉల్లంఘనలు ప్రమాదాలకు కారణమవడమే కాకుండా నిబంధనలను ఉల్లంఘించినందుకు జరిమానాకు అర్హులని బేగంపేట్ ట్రాఫిక్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. సోమవారం మాసబ్‌ట్యాంక్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్‌అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీలో జరిగిన రోడ్డు భద్రత, ట్రాఫిక్‌పై జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద టాప్ లైన్ మీద అన్ని వాహనాలు ఆగాలన్నారు. రాంగ్‌రూట్ వాహనాలు నడపడం అంటే ప్రమాదాలను ఆహ్వానించే నట్లన్నారు. వాహనాలు నడిపే సమయంలో ఫోన్ వాడరాదని, ట్రిపుల్ రైడింగ్ కూడా చట్టరీత్యా నేరమని ఆయన స్పష్టం చేశారు. సిగ్నల్ లైట్స్‌ను పాటిస్తే ట్రాఫిక్ సాఫీగా సాగడమే కాక ప్రమాదాలు కూడా సంభవించే ప్రమాదం తగ్గుతుందని ఆయన అన్నారు. ద్విచక్ర వాహనాలను నడిపేవారు కచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్ తమ వెంట ఉంచుకోవాలని, హెల్మెట్ కూడా ధరించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనివాస్, ప్రొఫెసర్ ఎం.వినోద్ గణేష్, హుమాయున్ నగర్ ఇన్‌స్పెక్టర్ నాయరాణ రెడ్డి, ఆసిఫ్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాంప్రసాద్ తదితరులున్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఉర్సు



ఉర్సులో హోంమంత్రి మహమూద్ అలీ, మెట్టు వెంకటేష్, నిజాం బాబా హరూని

అబిడ్స్: మతసామరస్యానికి ప్రతీక ఉర్సు అని హోంమంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. బోయిగూడ కమాన్‌లోని దర్గాలో హజ్రత్ సర్దార్ బేగ్ 101వ ఉర్సు ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. 2వ రోజు సోమవారం హోంమంత్రి మహమూద్‌అలీ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మహమూద్ అలీ మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాలుగా బోయిగూడ కమాన్‌లో నిజాంబాబా హరూని ఆధ్వర్యంలో ఉర్సు ఉత్సవాలు పెద్ద ఎత్తున చేపడుతున్నారని ఆయన అన్నారు. పలు జిల్లాలకు చెందిన వేలాది మంది భక్తులు విచ్చేసి ప్రార్థనలు నిర్వహించారు. నిర్వాహకులు వారికి భోజన వసతులు కల్పించారు. నాంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు మెట్టు వెంకటేష్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

'విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చి దిద్దుతున్నాం'



వార్షికోత్సవ వేడుకల్లో అధ్యాపక బృందం

గోల్కొండ: విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతున్నామని గుడిమల్కాపూర్‌లోని న్యూ ఈడెన్ హైస్కూల్ కరెస్పాండెంట్ గాలయ్య అన్నారు. సోమవారం పాఠశాల వార్షికోత్సవ వేడుకలు గుడిమల్కాపూర్‌లోని రాజలింగయ్య కబడ్డీ స్టేడియంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గోల్కొండ జోన్ డిప్యూటీ ఈఓ బానోతు వెంకటేశ్వర్లు, ఆసిఫ్‌నగర్ మండల డిప్యూటీ ఐవోఎస్ అజేందర్‌రెడ్డి, సెయింటాన్స్ జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాధాకిరణ్, న్యూ హిడెన్ హైస్కూల్ డైరెక్టర్ శశిపాల్‌రెడ్డి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 2 నుంచి కేసరి హనుమాన్ జయంత్యుత్సవాలు

జియాగూడ: శ్రీ సమర్థ రామదాసుస్వామి స్థాపించిన కేసరి హనుమాన్ మహా సంస్థాన్‌లో ఏప్రిల్ 2 నుంచి హనుమాన్ జయంత్యుత్సవాలు ప్రారంభమవుతున్నాయని ఆలయ ప్రతినిధి మహంత్ నారాయణ్ గంగాధర్ దేశ్‌పాండే తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆలయంలో మహోత్సవాల బ్రోచర్ విడుదల చేశారు. ఏప్రిల్ 2న హనుమాన్ జయంతి మహా మహోత్సవాలు ప్రారంభం, కలశ స్థాపన, రుద్ర స్వాహాకారం, 3న గోమాత మహాపూజ, రేణుకాంబదేవి వార్షిక మహోత్సవం, 4న శ్రీరామానందస్వామి 115వ ఆరాధన మహోత్సవం, 5న నవగ్రహ పవమాన హోమం, రామాయణ్ మండల్ చార్‌మహాల్ వారిచే సుందర కాండ ప్రారంభం, 6న తెల్లవారుజామున కేసరి హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఊయ్యాల సేవా, మంగళహారతి, పల్లకి సేవా, మహా నైవేద్యం, ఉంటాయన్నారు. ప్రతిరోజూ మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో చిన్నారులు

గోల్కొండ: మురాద్‌నగర్‌లోని రవీంద్రభారతి పాఠశాల కిడ్స్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి రవీంద్ర భారతి పాఠశాలల మెహిదీపట్నం జోన్ డీస్ ప్రియామనీష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె చిన్నారులకు పట్టాలు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రవీంద్ర భారతి పాఠశాలలో కిడ్స్ కాన్వకేషన్‌కు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. చిన్నారులు, వారి తల్లిదండ్రులు జీవితాంతం గుర్తుంచుకునేలా ఈ వేడుకలు నిర్వహిస్తామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేయించుకుంటున్న వైఎస్ అనురాధ దేవి

గోల్కొండ: కంటి సమస్యలు ఉన్న వారికి ఉచితంగా పరీక్షలు చేసి అద్దాలు ఇవ్వడమే కాకుండా అవసరం అయిన వారికి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామని తెలంగాణ రాష్ట్ర లోక్ జనశక్తి మజ్దూర్ ప్రధాన కార్యదర్శి మరాఠీ రవీందర్ అన్నారు. సోమవారం గోలకొండ బంజార దర్వాజ వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కమ్యూనిటీ భవనంలో ఫౌండేషన్ ఆఫ్ హిస్ సాక్రిడ్ మెజిస్టీ వారి సహకారంతో ఉచితంగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరం అయిన వారికి మందులు, కంటి అద్దాలు అందించారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ పుహేశ్వర్‌రావు, ఫౌండేషన్ సభ్యులు రాహుల్, యూనైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సేల్స్ ఫోర్స్ కమ్యూనిటీ మొబలైజర్ మాధవి, మునికుమార్, సుధాకర్ తదితరులున్నారు.

కాంట్రాక్టర్లకు బకాయిలు చెల్లించండి

అబిడ్స్: వాటర్‌బోర్డులో కాంట్రాక్టర్లకు పాత బకాయిలతో పాటు కొత్త బకాయిలను కూడా వెంటనే ఇచ్చి ఆదుకోవాలని తెలంగాణ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ జేఏసీ మీడియా ఇన్‌చార్జ్, కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. వాటర్‌బోర్డు సీజీఎం వినోద్ భార్గవ్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఏఎంఎస్ టెండర్ కానంత వరకు చేసిన కొత్త పనులు ఎస్టిమెంట్లు వేయకుండా కొంత మంది మేనేజర్లు, డీజీఎంలు ఏఎంఎస్ టెండర్లు వేస్తేనే చేసిన పనుల ఎస్టిమెంట్ ఇస్తామని చెప్పడం ఎంతో బాధాకరమన్నారు. కొత్త బిల్లులతో పాటు పాత బకాయిలు చెల్లిస్తే ఎంతోమంది కాంట్రాక్టర్లకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త విధానాన్ని రద్దు చేస్తే కాంట్రాక్టర్లకు ఉపాధి కలుగుతుందని శ్రీనివాస్ పేర్కొన్నారు.



సీజీఎం వినోద్ భార్గవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న పోల్కం శ్రీనివాస్

అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం అండ



మంత్రి తలసానిని సత్కరించిన నందకిశోర్ వ్యాస్ బిలాల్, ఆనంద్‌సింగ్, పప్పు మాత్రే

అబిడ్స్: అన్నివర్గాల ప్రజలకు ప్రభుత్వం అండగా ఉండి వారి పండగలను ప్రభుత్వమే నిర్వహిస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. ఈనెల 30న ధూల్‌పేట నుంచి నిర్వహించే శ్రీరామనవమి పాల్కి శోభాయాత్రకు మంత్రిని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నందకిశోర్ వ్యాస్, ఆనంద్‌సింగ్, పప్పుమాత్రే ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ.. ధూల్‌పేట్ నుంచి నిర్వహించే పాల్కి శోభాయాత్ర తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు నిలయంగా నిలుస్తుందన్నారు. శోభాయాత్రకు ప్రభుత్వం తరపున అన్ని శాఖల అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారని పేర్కొన్నారు. నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ... వేలాదిమందితో ధూల్‌పేట నుంచి శ్రీరామనవమి పాల్కి శోభాయాత్ర చేపడుతామన్నారు. ప్రతి సంవత్సరం ఆనంద్‌సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించే శోభాయాత్రను ఈ సంవత్సరం కూడా కనుల పండువగా నిర్వహిస్తామన్నారు. మంత్రి తలసాని ఈనెల 30న ధూల్‌పేటలో శ్రీరామనవమి పాల్కి శోభాయాత్రను ప్రారంభిస్తానని మంత్రి తలసాని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆనంద్‌సింగ్, పప్పు మాత్రే, కొల్లా ప్రదీప్‌రాజ్, కోటి శైలేష్‌కురుమ, హమీద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాటక రంగాన్ని భావితరాలకు అందించాలి



రంగస్థల కళాకారులను సన్మానిస్తున్న దీపికారెడ్డి, కేవీ.రమణాచారి

గన్‌ఫౌండ్రీ: సంస్కృతిని మరువకుండా ఆధునిక సాంకేతికను కళాకారులు అందిపుచ్చుకోవాలని తెలంగాణ రాష్ట్ర సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ దీపికారెడ్డి అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రసరంజని 30వ వార్షికోత్సవం సందర్భంగా నాటకోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాటకరంగంలో యువకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. నాటక రంగాన్ని భావితరాలకు అందించాలనే సంకల్పంతో నాటక అకాడమీ ఆధ్వర్యంలో ఏప్రిల్‌లో రాష్ట్రస్థాయి రంగస్థల ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం పలువురు రంగస్థల నటులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఎం.బాషా దర్శకత్వం వహించి ది ఇన్ పోస్టర్స్ నాటకాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ.రమణాచారి, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, రంగస్థల నటుడు దుగ్గిరాల సోమేశ్వర్‌రావు, తెలుగు విశ్వ విద్యాలయం లలిత కళాపీఠాధిపతి కోట్ల హన్మంతరావు, రంగస్థల దర్శకుడు బీఎం.రెడ్డితో పాటు రసరంజని కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రావణ్ కుమార్

అఫ్జల్‌గంజ్: నిత్యం ట్రాన్స్‌పోర్టులు, దుఖానాల్లో సరుకులు మోసే హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయకుండా దేశంలో దాదాపు 60 లక్షల మంది హమాలీలకు కేంద్ర ప్రభుత్వం తీవ్ర నష్టం చేస్తోందని సీఐటీయూ హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి శ్రావణ్‌కుమార్ ఆరోపించారు. సోమవారం గౌలిగూడ చమన్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. లేబర్ వెల్ఫేర్ బోర్డు సాధనకు, కార్మికులకు ఉపయోగం లేని, శ్రమ దోపిడీకి ఆస్కారం కలిగించేందుకు మోదీ సర్కార్ తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలని, పెంచిన గ్యాస్ సిలిండర్, పెట్రోల్ ధరలను వెంటనే డిమాండ్ చేస్తూ వాటి సాధనకు దేశంలోని వివిధ ప్రాంతాల్లో కార్మికులను చైతన్యం చేస్తూ నిరసన సభలు నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా ఈనెల 29న ఇందిరా పార్కు వద్ద ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు కార్మికులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, ఐద్వా, ఆవాజ్, డీవైఎఫ్ఐ, టీజీఎస్ తదితర ప్రజాసంఘాల నాయకులు, కార్మికులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

మజ్లిస్ నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండాలి



మజ్లిస్ కమిటీ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ పార్టీలో క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన టోలిచౌకిలోని ఆయన కార్యాలయం వద్ద మజ్లిస్ నాయకులతో సమావేశమై వారి దిశానిర్దేశనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మజ్లిస్ ఏరియా కమిటీ ప్రతినిధులు, సీనియర్ నాయకులు ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. మజ్లిస్ ఏరియా కమిటీలకు ఎంతో ప్రాధాన్యత ఉందని, వారి ద్వారానే సమస్యలు తన దృష్టికి వస్తాయన్నారు. మజ్లిస్ ఏరియా కమిటీ ప్రతినిధులు ప్రజలకు, తనకు వారధి లాంటివారని ఆయన పేర్కొన్నారు. తమ తమ ఏరియాలోని మసీదుల వద్ద రంజాన్ ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని ఆయన అన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్య పనులను ప్రతినిత్యం పర్యవేక్షించాలని సూచించారు. మసీదులకు నీరు అవసరమైన వారు ఆ విషయాన్ని తన దృష్టికి తేవాలన్నారు. రద్దీగా ఉండే ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని, చిరు వ్యాపారులకు ట్రాఫిక్ పోలీసులకు మధ్య సఖ్యత ఉండేలా చూడాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ సీనియర్ నాయకులు హారూన్ ఫరాన్, అజీజ్‌ఖాన్, హబీబ్‌చావూస్ తదితరులున్నారు.

మంత్రి తలసాని సహకారంతో గోషామహల్ అభివృద్ధి



జాంబాగ్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఆనంద్‌కుమార్ గౌడ్ తదితరులు

అబిడ్స్: మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సహకారంతో గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. అబిడ్స్, కట్టెలమండి, జాంబాగ్ ప్రాంతాల్లో వాటర్‌వర్క్స్ మేనేజర్ గుణశేఖర్‌తో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించారు. అనంతరం ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రజల వద్ద తెలుసుకున్న సమస్యలు ఎప్పటికప్పుడు మంత్రి తలసాని దృష్టికి తీసుకువెళ్లి పరిశీలిస్తున్నట్లు వివరించారు. మంత్రి సహకారంతో అన్ని శాఖల అధికారులకు సమస్యలు తెలిపి పరిష్కారం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నందుకుమార్, దాసరి రాజ్‌కుమార్, ధీరజ్‌కుమార్ జైస్వాల్, బిజ్‌కుమార్ జైస్వాల్, పూనం, బాబురావు పాల్గొన్నారు.

పౌరాణిక పద్య నాటకాలను కాపాడుకుందాం



గన్‌ఫౌండ్రీ: పౌరాణిక పద్య నాటకాలను భావితరాలకు అందించాల్సిన అవసరం ఎంతగానో ఉందని ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో స్టేజ్ లైన్ ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ప్రపంచ రంగస్థల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ రంగస్థల నటుడు సంజీవరావుచే దుర్యోధన ఏకపాత్రాభినయం, గట్టినేని సుధాకర్‌రావుచే సామ్రాట్ అశోక ఏక పాత్రాభినయం నాటకాలను ప్రదర్శించారు. అనంతరం పలువురు రంగస్థల నటులకు జీవిత సాఫల్య పురస్కారాలను అందజేశారు. సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ, యువకళావాహిని అధ్యక్షుడు లంకా లక్ష్మీనారాయణ, సంస్థ సభ్యులు రవికుమార్, విష్ణుప్రియా పాల్గొన్నారు.